ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- రామశింగవరంలో గడపగడపకు మన ప్రభుత్వం


రామశింగవరంలో ప్రజలు తెలిపిన సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : రాష్ట్ర చరిత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం రామశింగవరంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జెడ్పీ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్యతో కలిసి పెదవేగి మండలం రామశింగవరం సచివాలయ పరిధిలోని ప్రతి గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించి వారికి లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే స్థానికులను అడిగి తెలుసుకుంటూ వాటిని పరిష్కరించారు. పసుమర్తి మహీంద్ర, సీతాల దాసు, రాచపల్లి గంగాధరరావు, అద్దేపల్లి రాంబాబు, రాచపల్లి రాంబాబు, చింతపల్లి నాగరాజు, వెన్నవెల్లి రవి, గోపిశెట్టి శ్రీను, గోపిశెట్టి రాజు, రాటాలమ్మ దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు, గోపిశెట్టి రాధమ్మ, జిల్లా నాగరాజు, బైపా ఆదాం, కంటిపూడి ధర్మరాజులు, ఆళ్ళ బాబి, యలమర్తి జయరాజు, జిల్లా వెంకటేష్, జమ్మిశెట్టి ఆంజనేయులు, సిదర్ల వరబాబు, చిలుకూరి సుబ్బారావు, ఇతర ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు సభ్యులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యలో ఉన్నత లక్ష్యాలను సాధించాలి

దెందులూరు: మైనర్ పంచాయతీ అయిన సానిగూడెంలో సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ (విష్ణు), విజయలక్ష్మి దంపతుల కుమారుడు రామసాయిమణికంఠ చైనాలో వైద్య విద్య పూర్తి చేసి స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఏకాగ్రత, పట్టుదలతో వైద్యవిద్యలో ఉన్నత లక్ష్యాలను సాధించి స్వగ్రామానికి, స్వదేశానికి మంచిపేరు తీసుకురావాలని, దీనికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ మాట్లాడుతూ కొఠారు కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, సొసైటీ చైర్మన్ పెదబాబు, స్థానిక నాయకులు ఉన్నారు.

పంటలకు సమృద్ధిగా సాగు నీరు

- 12వేల ఎకరాలకు తొలగిన సాగునీటి ఇబ్బందులు
- పోలవరం కాలువ ద్వారా నీరు సరఫరా
- ఆయకట్టు రైతుల హర్షం


కొప్పులవారిగూడెంలో పోలవరం కాలువ నీటి విడుదలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి (ఫైల్)

దెందులూరు: మండలం పరిధిలోని 8 గ్రామాల్లోని 12 వేల ఎకరాల ఆయకట్టు భూముల్లో ఏటా రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఈ 12 వేల ఎకరాలకు సాగునీటి సమస్యను తొలగించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని సోమవరప్పాడు, ఉప్పుగూడెం, అలుగులగూడెం, సానిగూడెం, దెందులూరు, సత్యనారాయణపురం, కొమిరేపల్లి, సీతంపేట గ్రామాల్లో 12 వేల ఎకరాలకు సాగునీటి కోసం వీధి పోరాటాలు చేయాల్సి వచ్చేదని రైతులు అన్నారు. ఏటా సాగునీటి కోసం ఎదురుచూస్తూ సాగుకు చేపట్టాల్సి వచ్చేదని వారన్నారు. మండలంలోని రైతుల అవస్థలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించి పోలవరం కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయించడంతో పంటల సాగుకు నీటి ఇబ్బందులు తొలగిపోయాయని దెందులూరులో కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, రైతులు మంగళవారం అన్నారు. మండలంలోని 12 వేల ఎకరాల ఆయకట్టు రైతులు, వారి కుటుంబ సభ్యులు, కూలీలు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, కొఠారు రామచంద్రరావుకు, సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడివేదకుమారి, సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, కొవ్వలి సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, సత్యనారాయణపురం రైతు బినంపూడి రాము, దెందులూరు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు సాగునీరు విడుదల చేయినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వరిలో ఎండాకు తెగులు ఉధృతం

దెందులూరు: జిల్లాలో వరి పంటపై ఎండాకు తెగులు ఉధృతంగా ఉందని, దీని నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం ఏలూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే.ఫణికుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాత, శాస్త్రవేత్త నాగేంద్రబాబు అన్నారు. మంగళవారం దెందులూరు, సానిగూడెంలో వరి పొలాలను వారు పరిశీలించారు. వరి నాట్లు వేసిన 25-30 రోజుల్లోపు ఆకులపై నుంచి కిందకు ఎండిపోవడం, ఆకులు పసుపు రంగులోకి మారడాన్ని గమనించాలన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు 26 శాతం అంతకన్నా తక్కువగా ఉండటం వల్ల, వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల ఎండాకు తెగులు వస్తుందన్నారు. ఈ తెగులు వచ్చిన వెంటనే రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. తెగులు ఆశించిన పొలాల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా బయటకు వదిలేయాలన్నారు. పొటాష్ ఎరువును 20 కేజీలు విధిగా వేయాలని, సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులను వాడాలన్నారు. కాపర్ హైడ్రాక్సైడ్ 20 గ్రాములు, ప్లస్ ప్లాంటామిజన్ 1.0 గ్రాములు, ఒక లీటరు నీటికి కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు పనులు చేయాలని శాస్త్రవేత్తలు ఫణికుమార్, సుజాత, నాగేంద్రబాబు రైతులను కోరారు.

సీహెచ్‌సీలో అదనంగా మౌలిక వసతులు కల్పిస్తాం


దెందులూరు సీహెచ్‌సీలో సమావేశమైన అభివృద్ధి కమిటీ సభ్యులు

దెందులూరు: దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరులో అదనంగా మౌలిక వసతులు కల్పిస్తామని అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. విద్యుత్ దీపాలు, సిబ్బందికి ప్రత్యేక మరుగుదొడ్లు, జనరేటర్ల ఏర్పాటుపై తీర్మానం చేసినట్టు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు కట్టా ఏసుబాబు, తొత్తడి వేదకుమారి అన్నారు. మంగళవారం దెందులూరు సీహెచ్‌సీలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆసుపత్రి ప్రాంగణంలో మదర్ థెరిస్సా విగ్రహం నెలకొల్పుతామని కట్టా ఏసుబాబు చెప్పడంతో కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం అభివృద్ధి కమిటీ సభ్యులు వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చల్లా మేరీరాజు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదపాడు: కోర్టు వాయిదాకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి అదృశ్యం కావడంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీరమ్మకుంట గ్రామానికి చెందిన నడిమిండి సాంబశివరావు (39) పార్వతీపురంలో అత్తగారి ఇంటి వద్ద కొన్ని రోజులు ఉన్నాడు. అనంతరం సెల్‌ఫోన్ దొంగతనం కేసులో అతనిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసారు. కోర్టు వాయిదాకు వెళ్లి వస్తానని జూన్‌లో వెళ్లిన సాంబశివరావు ఇంతవరకు ఆచూకీ లేకపోవడంతో బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ చల్లా మంగళవారం తెలిపారు.

మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపాలి


పెదపాడు: అప్పనవీడు సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

భీమడోలు: మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని ఆపాలని, మత సామరస్యాన్ని పరిరక్షించాలని, దీనిపై పీఎం నరేంద్రమోదీ నోరు విప్పాలని కోరుతూ భీమడోలులో మంగళవారం హిందూ, క్రైస్తవ, ముస్లింలు పెద్ద ఎత్తున కదం తొక్కారు. ప్లకార్డులను చేతపట్టుకుని నల్లబ్యాడ్జీలు ధరించి వీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. తొలుత భీమడోలు రైల్వే గేటు వద్దకు రాజకీయాలకతీతంగా, వివిధ సంఘాల ఆధ్వర్యంలో వందలాది మంది హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. మండల ఐక్య పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ రత్నం అధ్యక్షతన భీమడోలు జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేసారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ మణిపూర్ బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు. అనంతరం ర్యాలీగా వెళ్లి భీమడోలు డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాస్టర్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ అచ్యుతం, వివిధ సంఘాల నాయకులు పి.రాజారావు, కట్టా భాస్కరరావు, జోషి, పరమానందం, జోసెఫ్, ఆజీ మ్, జహార్, సుమన్, జి.ప్రసాదరావు, యోషయ్య, ఎస్.జయరాజు, బి.సీమోన్ పాల్గొన్నారు.

అప్పనవీడులో శాంతి ర్యాలీ

పెదపాడు: మణిపూర్‌లో హింసాత్మక ఘటనలకు నిరసనగా అప్పనవీడులో మంగళవారం ఐక్య క్రైస్తవ శాంతి ర్యాలీ నిర్వహించారు. కమిటీ సభ్యులు పాస్టర్ రవి స్టాలిన పాస్టర్ శుభాకర్ పాస్టర్ త్నబాబు, రత్నభూషణం, పాస్టర్ పేతురు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వివిధ సంఘాల పాస్టర్లు సంఘ పెద్దలు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి నరగ్, ఆర్‌సీఎం చర్చి వద్ద ఫాదర్ చేబ్రోలు జోషఫ్ తంబి ప్రార్థనలు చేసారు. సర్పంచ్ సరిపల్లి కమల కిరణ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అప్పనవీడు సెంటరులోని నాలుగు కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు పాస్టర్లు సందేశం వినిపించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్దలు మురళి తమ సందేశాన్ని వినిపించారు. మైకేల్ రాజు రవిస్టాలిన్ ర్యాలీ ముగింపు ప్రార్థనలు చేసారు. బాపుల పాడు తహసీల్దార్‌కు మణిపూర్ అల్లర్ల నివారణకు తగు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందించారు. పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో సంపూర్ణమ్మ రెవ. నవీన్, బిషప్ జోషఫ్ రాబర్ట్ బిషఫ్ రత్నబాబు, రవిస్టాలిన్ సునీల్, స్టాన్లీ ప్రభాకర్, జయరాజు, రాజశేఖర్ యం దేవదాసు పాల్గొన్నారు.



భీమడోలు: డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘాల ప్రతినిధులు

విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతితో తీవ్ర నష్టం


కొబ్బరి రైతుల సదస్సులో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు

పెదవేగి : విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతితో మార్కెట్‌లో కొబ్బరికాయలకు ధర తగ్గడంతో కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు తీవ్రంగా విమర్శించారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస ధరలు కల్పించి రైతుల నుంచి కొబ్బరికాయలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పెదవేగి మండలం విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం యార్డు ఆవరణలో మంగళవారం కొబ్బరి రైతుల సంఘం- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కొబ్బరి రైతుల జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కొబ్బరి రైతుల సమస్యలపై తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేశవరావు మాట్లాడుతూ కొబ్బరికాయలకు కనీస ధరలు రాక రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కొబ్బరి రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాలలో కొబ్బరి పంట సాగు అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరల స్థిరీకరణ నిధి పథకం కొబ్బరి రైతులకు వర్తింపజేయాలని కోరారు. కేరళ తరహాలో సహకార రంగంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సదస్సుకు ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం కార్యదర్శి బొల్లి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తక్షణం తెరవాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న కొబ్బరి రైతుల సమస్యలపై చలో కలెక్టరేట్ ధర్నా నిర్వహించాలని సదస్సు తీర్మానించింది. ఈ సదస్సులో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, కొబ్బరి రైతులు నవుడు సత్తిబాబు, బొమ్మా రెడ్డి రామచంద్రారెడ్డి, పులగం వేణుగోపాల రెడ్డి, గంటా పాపారావు, కల్లం శివారెడ్డి,గుదిబండి రమేష్ రెడ్డి, పానుగంటి అచ్యుత రామయ్య మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కొబ్బరి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో వివిధ మండలాలకు చెందిన కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెదపాడు: అన్నదమ్ములు కొట్లాటపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన ముంగర జగన్నాథం, ముంగర సత్యనారాయణ చేపల చెరువు విషయంలో మంగళవారం తగాదా పడి కొట్లాడుకున్నారు. ఈ కొట్లాటపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

భర్త కొట్టడంపై భార్య ఫిర్యాదు

పెదపాడు: భర్త తాగి రాయితో కొట్టడంతో రక్తపు గాయాలు కావడంతో భార్య పెదపాడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని సకలకొత్తపల్లి శివారు కడిమికుంట గ్రామానికి చెందిన శింగవరకు నాగరాజు మద్యం తాగి ఇంటి వచ్చి భార్యతో తగాదా పడి రాయితో మూతిపై కొట్టాడు. దీంతో ఆమె రెండు పళ్లు ఊడి రక్తపు గాయాలయ్యాయి. దీంతో పెదపాడు పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. పెదపాడు ఎస్సై కృష్ణ చల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

ఏలూరు (టూటౌన్) : ప్రజా గాయకుడు, విప్లవ కవి గద్దర్ మృతి కళాకారులకు, సాహితీ రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ప్రజా నాట్యమండలి గాయకుడు, ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు ఒక ప్రకటనలో తెలియజేశారు. గద్దర్ జన నాట్యమండలి వ్యవస్థాపకుల్లో ఒకరని, తన గాత్రంతో తెలుగు రాష్ట్రాల ప్రజలను తనదైన శైలిలో ఉర్రూతలూగించారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ఆ ఉద్యమానికి ఊపు తెచ్చారని ఆదిశేషు తెలిపారు. గద్దర్ మృతిపై ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కళ్ల కలక విజృంభణ

- వాతావరణ మార్పులతో వేగంగా వ్యాపిస్తున్న కళ్ల కలక
- పీహెచ్‌సీలో అందుబాటులో మందులు, ఐ డ్రాప్స్
- పిల్లలకు త్వరగా సోకుతున్న వ్యాధి


కళ్ల కలక సోకిన బాలుడు (ఫైల్)

గణపవరం: వాతావరణ మార్పులతో కళ్లకలక విజృంభిస్తోంది. రెండు వారాలుగా ఈ వ్యాధి వ్యాప్తి తీవ్రంగా ఉంది. కళ్లకలక వ్యాధికి గురికానివారంటూ ఎవరూ లేరన్నంతగా ఈ వ్యాధికి పలువురు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, చిన్న పిల్లల్లో కళ్లకలక వ్యాధి త్వరగా వ్యాపిస్తుంది. పాఠశాలల్లో ఒకరి నుంచి మరొకరికి ఈ ఇన్‌ఫెక్షన్ త్వరగా వ్యాప్తి చెందుతోంది. ఒకరిద్దరికి ఈ వ్యాధి సోకితే మిగిలిన వారికి కూడా వేగంగా వ్యాప్తి చెందుతోంది. దీనితో కళ్ల కలకకు గురైన విద్యార్థులను ఉపాధ్యాయులు ఇళ్లకు పంపించి వేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షాల వల్ల ఈవ్యాధి మరింతగా వ్యాపిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులన్నీ కళ్లకలక బాధితులతో కిటకిటలాడుతున్నాయి. తాత్కాలిక ఉపశమనం కోసం మందుల షాపులకు వెళ్లి పలువురు బాధితులు మందులు వేపకాయ ట్యూబులు, ఐ డ్రాప్ వంటివి తీసుకెళ్తున్నారు. ఇది అంటువ్యాధి కావడంతో గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతోంది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమై అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన మందులు, ఐ డ్రాప్స్ అందుబాటులో ఉంచింది. చిన్న పిల్లలకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కళ్లకలకవల్ల పెద్ద ముప్పులేనప్పటికీ అప్రమత్తత అవసరమని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే దీని నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుందని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.


ఇవీ లక్షణాలు

కళ్లు ఎర్రబారడం, నీరుకారడం, కంటిలో ఇసుక పడినట్లు అనిపించడం, కనురెప్పలు వాయడం, కళ్లు అంటుకుపోవడం, తలనొప్పి, లింఫ్‌నోడ్స్ వాపు తదితర లక్షణాలు కనిపిస్తుంటాయి. బ్యాక్టీరియా, వైరస్, ఎలర్జీ, దుమ్ము, ధూళి, కారణంగా కళ్లకలక వస్తుంది. ప్రస్తుతం కళ్లకలక వైరస్ వల్ల వ్యాపిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కళ్లకలక బాధితులు గోరువెచ్చని నీటితో తరచూ కళ్లు శుభ్రం చేసుకోవాలి. కళ్లు నలపకూడదు. దానివల్ల కంటిలో నల్లగుడ్డు, కంటిపైన ఉండే పల్చనిపొర దెబ్బతినే అవకాశం ఉంటుంది. కళ్లు ఒత్తిడికి లోనుకాకుండా విశ్రాంతి ఇవ్వాలి. వ్యాధి సోకిన వారికి దూరంగా ఉండటం మంచిది. వారు వాడిన టవల్, సబ్బు వంటివి ఇతరులు వాడకుంటే మంచిది. పొరపాటున ముట్టుకుంటే చేతులను సబ్బుతో, శానిటైజర్‌తో కడుక్కోవాలి. బాధితులు వైద్యులను సంప్రదించి సరైన యాంటీబయాటిక్ చుక్కల మందు, లూబ్రికేటింగ్ చుక్కల మందు వంటి వాటితో పాటు అవసరాన్ని బట్టి పెయిన్ కిల్లర్స్ వాడాలి. పెద్దలకు, పిల్లలకు వేర్వేరుగా చెక్కల మందు ఉంటుంది.

ఆందోళన వద్దు



కళ్ల కలక అంటువ్యాధి కావడంతో వేగంగా వ్యాప్తి చెందుతుంది. వర్షాకాలంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వ్యాధి సోకిన వారు ఆందోళన చెందకుండా వైద్యులను సంప్రదించాలి. వీలైనంత వరకూ ఇతరులతో కలవకుండా ఉంటే మంచిది. వారువాడే వస్తువులు ఇతరులు వాడరాదు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు, ఐ డ్రాప్స్ వాడాలి.

– పులపర్తి సంతోష్, వైద్యాధికారి, గణపవరం పీహెచ్‌సీ

క్లుప్తంగా

ఎన్నికల అధికారుల బాధ్యతల స్వీకరణ


సుబ్రహ్మణ్యం

ఉంగుటూరు : మండలం పరిధిలోని పంచాయతీల్లో 3 వార్డుల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా ఎన్నికల అధికారులను నియమించారు. కాకర్లమూడిలో రెండు వార్డులకు ఎన్నికల నేపథ్యంలో నిడమర్రు మండలం పీఆర్ ఏఈ కె.ప్రవీణ్‌కుమార్‌ను నియమించింది. ఆయన కాకర్లమూడిలో బాధ్యతలు స్వీకరించారు. నామినేషన్లు దాఖలు కాలేదని ఆయన తెలిపారు. ఉంగుటూరులో ఒక వార్డుకు ఎన్నిక జరగనుంది. ఈ క్రమంలో నిడమర్రు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహమణ్యం ఎన్నికల అధికారిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నామినేషన్లు దాఖలు కాలేదని ఆయన తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు


కైకరం హైస్కూల్లో విద్యార్థులకు పరుగు పోటీ

ఉంగుటూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కైకరం హైస్కూల్లో వారోత్సవాలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు ప్రారంభించారు. జూనియర్, సీనియర్‌స్థాయిలో పరుగుపందెం,ఇతర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీధర్‌కు సత్కారం


ఎంపీని కలిసిన ఏపీ లిడ్ క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ సొంగా సందీప్

దెందులూరు: ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ డిప్యూటీ చైర్మన్‌గా నియమితులైన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను మంగళవారం ఎంపీ కార్యాలయంలో ఏపీ లిడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ సొంగా సందీప్ అభినందించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీ శ్రీధర్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఫుట్‌బాల్ క్రీడకు మరింత వన్నె లభిస్తుందని, ప్రతిభగల యువతను ప్రోత్స హించడంలో ఆయన ముందున్నారన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫాదర్ అమ్మన్‌రాజా

దెందులూరు: చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాటలో పయనిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జీ. అమ్మాన్‌రాజా అన్నారు. మంగళవారం దెందులూరులో ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఆదేశాల మేరకు మండలంలో ఏడు గ్రామాలకు చెందిన పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 420 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా ఫాదర్ అమ్మన్‌రాజా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ ఏటా ఉచితంగా విద్యార్థులందరికీ నోట్ పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లు లక్ష్యాలు నెరవేర్చాలి


వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాద్, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి

దెందులూరు: వెల్ఫేర్ అసిస్టెంట్లు అంకితభావంతో విధులు నిర్వర్తించి శాఖాపరమైన విధి నిర్వహణలో లక్ష్యాలు నెరవేర్చాలని మిషన్-జీఈఆర్ విజయవంతం చేయాలని ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా లక్ష్యాలను ఉద్యోగులు గుర్తెరిగి విధులు నిర్వహించాలన్నారు.

నేడు రైతులకు ఆయిల్ పామ్ మొక్కల పంపిణీ

దెందులూరు: రామారావుగూడెంలో మేడికొండ కొండయ్య పొలంలో రైతులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేస్తారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. రైతులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.